క్లుప్తంగా

ఆలయానికి రూ. లక్ష విరాళం



తిరువూరు: స్థానిక రాజుపేటలోని అష్టలక్ష్మీ దేవాలయ అభివృద్ధి పనులకు గంపలగూడెం మాజీ ఎంపీపీ యనమద్ది పుల్లయ్య చౌదరి రూ.లక్ష విరాళం అందజేశారు. ఆదివారం ఆలయ ధర్మకర్త కాసులనాటి పద్మనాభశాస్త్రికి పుల్లయ్య చౌదరి విరాళాన్ని అందజేశారు. ఆలయంలో శాలాహార నిర్మాణానికి ఈ విరాళాన్ని ఇచ్చినట్లు తెలిపారు.

నేడు ఉప సర్పంచ్, వార్డు సభ్యులకు శిక్షణ

నూజివీడు: మండలంలోని ఉప సర్పంచ్‌లకు, పంచాయతీ వార్డు సభ్యులకు శిక్షణ తరగతులు సోమవారం నుంచి ఈ నెల 10వ తేదీ వరకు నిర్వహిస్తామని ఎంపీడీఓ సి. రాఘవేంద్రనాథ్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయ ఆవరణలోని సమావేశ మందిరంలో తరగతులు జరుగుతాయన్నారు. గ్రామ పంచాయతీ సాధారణ పరిపాలన, ఆర్థిక వ్యవహారాల నిర్వహణ, పారిశుద్ధ్య కార్యక్రమాల నిర్వహణపై శిక్షణ ఇస్తామన్నారు.

రౌడీషీటర్లకు కౌన్సెలింగ్



ఆగిరిపల్లి: నేర సంబంధిత కార్యక్రమాల్లో పాల్గొని భవిష్యత్‌ను నాశనం చేసుకోవద్దని ఎస్ఐ శుభశేఖర్ అన్నారు. స్థానిక పోలీస్‌స్టేషన్ వద్ద ఆదివారం రౌడీషీటర్లకు కౌన్సెలింగ్ నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ సంఘ వ్యతిరేక కార్యకలాపాల్లో పాల్గొని శాంతికి విఘాతం కలిగిస్తే చట్టపరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు. సత్ప్రవర్తన కలిగి ఉన్నవారిపై రౌడీ షీట్ తొలగించేందుకు ఉన్నతాధికారులకు సిఫారసు చేస్తామని చెప్పారు.

నేడు సబ్ కలెక్టర్ కార్యాలయంలో 'మీ కోసం'

నూజివీడు: పట్టణంలోని సబ్ కలెక్టర్ కార్యాలయంలో ప్రజా సమస్యల పరిష్కార వ్యవస్థ (మీకోసం) కార్యక్రమాన్ని సోమవారం నిర్వహిస్తామని ఆర్డీఓ మొవిడి వాణి ఆదివారం తెలిపారు. ఉదయం 10.30 గంటల నుంచి నిర్వహించనున్న ఈ కార్యక్రమంలో డివిజన్ పరిధిలోని ప్రజలు తమ సమస్యలపై అర్జీలను అందిస్తే వాటిని గడువులోగా పరిష్కరిస్తామని చెప్పారు.

నేడు చాట్రాయి మండల పరిషత్ సమావేశం

చాట్రాయి: మండల పరిషత్ సర్వసభ్య సమావేశం సోమవారం మధ్యాహ్నం రెండు గంటలకు నిర్వహిస్తామని ఇన్‌చార్జి ఎంపీడీఓ జి. రాణి తెలిపారు. ఆదివారం ఆమె విలేకరులతో మాట్లాడుతూ స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ లంకా నిర్మల అధ్యక్షతన జరిగే సమావేశంలో అన్ని శాఖల అధికారులు, ప్రజాప్రతినిధులు పాల్గొనాలని ఆమె కోరారు.

ఆర్థిక సాయం అందజేత



మైలవరం: రెడ్డిగూడెం దళితవాడకు చెందిన చింతిరాల మరియమ్మ ఇల్లు ఇటీవల వరదలకు కుప్పకూలిపోయింది. తన పెద్ద కుమారుడు మంచాన పడటంతో తీరని దుఃఖంలో ఉన్న కుటుంబానికి ఎమ్మెల్యే వసంత వెంకట కృష్ణప్రసాద్ సూచనల మేరకు టీడీపీ నాయకుడు ఉయ్యూరు వెంకటేశ్వరరెడ్డి (పెదబాబు) స్పందించి బాధిత కుటుంబానికి రూ.10 వేలు ఆర్థిక సహాయం అందజేశారు. నాయకులు పాల్గొన్నారు.

అన్నదానం

ఊటుకూరు(గంపలగూడెం): శరన్నవరాత్రి వేడుకల్లో భాగంగా మండలంలోని ఊటుకూరులో శనివారం రాత్రి అన్నదానం చేశారు. గ్రామంలోని దుందిరాలపాడు రహదారిలో నెలకొల్పిన అమ్మవారికి ముందుగా అర్చకులు ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం నిర్వహించిన అన్నదానంలో పెద్దసంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

ఐఆర్ ప్రకటించాలి

మైలవరం: ప్రభుత్వ ఉద్యోగ, ఉపాధ్యాయులకు నూతన ప్రభుత్వం దసరా కానుకగా డీఏ కానీ, ఐఆర్ (మధ్యంతర భృతి) కానీ ప్రకటించాలని పీఆర్‌టీయూ నాయకులు పి. గోపాల్, ఎం.వెంకటేశ్ కోరారు. పీఆర్‌టీయూ మైలవరం మండల శాఖ కార్యవర్గం ఆదివారం జరిగింది. పాత పీఆర్‌సీలో పెండింగ్ డీఏలు సర్వీస్ పుస్తకంలో నమోదు చేయాలని తీర్మానించారు. సమావేశంలో ఉపాధ్యాయులు ఎస్.శేషగిరిరావు, సతీష్, సూరిబాబు, గోపాలం, రాష్ట్ర కార్యదర్శి పుల్లారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

వచ్చారు.. వెళ్లారు

- గ్రామ సభలకు హాజరుకాని ప్రజాప్రతినిధులు, ప్రజలు
- సచివాలయ సిబ్బందితోనే నిర్వహణ
- చర్చలు లేకుండానే తూతూమంత్రంగా సభలు
- ఒక్కో సభకు రూ.10 వేల వరకు ఖర్చు
- నిర్వీర్యమవుతున్న గ్రామ సభల అజెండా

జి.కొండూరు: గ్రామ స్థాయిలో అభివృద్ధి ప్రణాళికలు, సమస్యల పరిష్కారం వంటి ప్రధాన అంశాలపై ప్రతి మూడు నెలలకు ఒకసారి గ్రామ సభల పేరుతో నిర్వహించాల్సిన సమావేశాలు నియోజకవర్గంలో నామమాత్రంగానే జరిగాయి. ప్రజలు, ప్రజాప్రతినిధులు లేక సభలు వెలవెలబోయాయి. ప్రభుత్వ ఖజానా నుంచి ఖర్చు కనిపించడం తప్ప ప్రభుత్వ లక్ష్యాలు మాత్రం పూర్తి కావడంలేదు. అభివృద్ధి కుంటుపడుతోంది. ప్రజా సమస్యలకు పరిష్కారం లభించడం లేదు.

ప్రతి మూడు నెలలకు సభలు..

గ్రామ పంచాయతీలో అభివృద్ధి, సంక్షేమం, సమస్యల పరిష్కారం కోసం ప్రతి మూడు నెలలకు ఒకసారి గ్రామ సభలను నిర్వహిస్తారు. ఈ సభకు సర్పంచ్, వార్డు సభ్యులు, గ్రామ సచివాలయ అధికారులు, గ్రామ పంచాయతీ కార్యదర్శి, ఇతర ప్రజాప్రతినిధులు, గ్రామ ప్రజలు తప్పక హాజరు కావాలి. కానీ గ్రామ పంచాయతీలలో నిర్వహించిన ఏ ఒక్క గ్రామ సభకు కూడా ప్రజాప్రతినిధులు కానీ, ప్రజలు కానీ హాజరు కావడంలేదు. కేవలం సచివాలయ సిబ్బంది, గ్రామ పంచాయతీ కార్యదర్శులే హాజరై తూతూమంత్రంగా సభలను నిర్వహించారు. దీనివల్ల ఈ సభల్లో జరగాల్సిన చర్చ, తీసుకోవాల్సి నిర్ణయాలు, అభివృద్ధి ప్రణాళికలు, సంక్షేమ పథకాల అమలు, సమస్యల పరిష్కారం, నిధులు, ఖర్చు వంటి అంశాలు పక్కదారి పడుతున్నాయి. లక్ష్యంలేని ఈ సభలకు గ్రామ పంచాయతీలు వెచ్చిస్తున్న ఖర్చు బూడిదలో పోసిన పన్నీరులానే మారుతోంది. గ్రామ సభలపై ప్రజలకు అవగాహన కల్పించడంలో అధికారులు నిర్లక్ష్యం వహించడం వల్లే సభలకు ఎవ్వరూ హాజరు కావడం లేదనే ఆరోపణ ఉంది.



జి. కొండూరులో ఇటీవల నిర్వహించిన గ్రామసభకు హాజరైన సర్పంచ్, కార్యదర్శి

గ్రామాలలో నిర్వహిస్తున్న కార్యక్రమాలకు ప్రజాప్రతినిధులను ఆహ్వానించడంలో అధికారులు రాజకీయ వివక్ష చూపుతున్నందు వల్లే గ్రామ సభలకు హాజరు కావడం లేదనేది బహిరంగంగానే చర్చ జరుగుతోంది.

చర్చలు, తీర్మానాలు లేకుండానే..

మైలవరం నియోజకవర్గంలో ఎటువంటి చర్చలు, తీర్మానాలు లేకుండా గ్రామ సభలను ముగించారు. నియోజకవర్గంలో మైలవరం, జి.కొండూరు, రెడ్డిగూడెం, ఇబ్రహీంపట్నం, విజయవాడ రూరల్ మండలాలు ఉన్నాయి. ఈ ఐదు మండలాల్లో 65 గ్రామాలు ఉండగా 61 గ్రామ పంచాయతీలు, 77 గ్రామ సచివాలయాలు ఉన్నాయి. నియోజకవర్గంలో 3.20 లక్షల వరకు జనాభా ఉన్నారు. ఈ విధంగా 61 గ్రామ పంచాయతీలలో ఒక్కో గ్రామ పంచాయతీలో సంవత్సరానికి నాలుగు గ్రామ సభల చొప్పున 244 గ్రామ సభలు జరుగుతున్నాయి. ఇవి కాకుండా ప్రభుత్వం ప్రత్యేకంగా నిర్వహించే గ్రామ సభలు, జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం గ్రామ సభలు, రెవెన్యూ గ్రామ సభలు అదనంగా జరుగుతున్నాయి.

గ్రామ సభల అజెండా ఇలా..

- మూడు నెలల కాలంలో జమలు, ఖర్చులు గ్రామ సభలో చదివి వినిపించాలి.
- గ్రామ పంచాయతీ పరిపాలనా విషయాలు అజెండాలో చేర్చి సభ అమోదం కోసం చదివి వినిపించాలి.
- సాధారణ నిధులు, ఎంజీఎన్ఆర్ఈజీఎస్ నిధులు, 15 ఆర్థిక సంఘం నిధులు, పనుల ప్రగతిపై సమీక్ష జరపాలి.
- పన్నులు, ఫీజులు, బకాయిదార్ల పేర్లు చదివి వినిపించాలి. ఆదాయ వనరులు, పనులపై సమీక్షించాలి.
- గ్రామ పంచాయతీ అభివృద్ధి ప్రణాళికపై చర్చించి తీసుకున్న నిర్ణయాలను ఆమోదించాలి.
- జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకంలో పనుల గుర్తింపు, లేబర్ బడ్జెట్ తయారు చేసి గ్రామ సభలో ఆమోదం కోరాలి.
- 73వ రాజ్యాంగ సవరణ ద్వారా పంచాయతీరాజ్ సంస్థలకు అప్పగించిన 29 అంశాలపై సమీక్షలు జరిపి నివేదికలను చదివి వినిపించాలి.

ప్రజా సమస్యలు పట్టని పాలకులు

సీపీఎం ఎన్టీఆర్ జిల్లా కార్యదర్శి డీవీ కృష్ణ



సమావేశంలో మాట్లాడుతున్న డీవీ కృష్ణ

తిరువూరు: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రజా సమస్యలు విస్మరించి సనాతన ధర్మం పేరుతో ప్రజల నడుమ మత విద్వేషాలు సృష్టిస్తున్నాయని సీపీఎం ఎన్టీఆర్ జిల్లా కార్యదర్శి డీవీ కృష్ణ విమర్శించారు. పార్టీ ముఖ్య నాయకుల సమావేశం ఆదివారం తిరువూరు సుందరయ్య భవన్‌లో జరిగింది. డిసెంబర్‌లో తిరువూరులో జరగనున్న 25వ జిల్లా మహాసభలకు ఆహ్వాన సంఘం ఏర్పాటు చేసిన సందర్భంగా జరిగిన ఈ సమావేశంలో కృష్ణ మాట్లాడుతూ ప్రజా ఉద్యమాలతోనే సమస్యలకు పరిష్కారం లభిస్తుందన్నారు. వినగడప కట్టలేరుపై వంతెన నిర్మాణం, ఎ. కొండూరు మండలంలో కిడ్నీ రోగుల సమస్యల పరిష్కారం, తిరువూరు పట్టణంలో రహదారులు, డ్రెయినేజీ, మంచినీటి సమస్య, కోతులు, కుక్కల నివారణ తదితర అంశాలను పాలకులు పూర్తిగా విస్మరించారని విమర్శించారు. ప్రజా సమస్యలపై పోరాడే సీపీఎం జిల్లా మహాసభలను తిరువూరులో నిర్వహించడానికి ప్రతి ఒక్కరూ సహకరించాలని ఆహ్వాన సంఘం గౌరవాధ్యక్షుడు సానికొమ్ము నాగేశ్వరరెడ్డి కోరారు. సంఘం అధ్యక్షుడిగా గుళ్లపల్లి వెంకటరత్నం, కార్యదర్శిగా మేకల నాగేంద్రప్రసాద్, కోశాధికారిగా బి. వెంకటేశ్వరరావు నియమితులయ్యారు. సమావేశంలో విస్సన్నపేట, ఎ.కొండూరు, గంపలగూడెం, తిరువూరు పార్టీ కార్యదర్శులు నాగరాజు, జెట్టి వెంకటేశ్వరరావు, గువ్వల సీతారామిరెడ్డి, ఆలీ బాబా, డాక్టర్ రవీంద్ర పాల్గొన్నారు.

రాహుల్ గాంధీని విమర్శించే స్థాయి పవన్ కల్యాణ్‌కు లేదు

నూజివీడు: మోదీ డైరెక్షన్ లేనిదే పాలిటిక్స్, స్క్రిప్ట్ లేకుండా స్టేజీలపై మాట్లాడలేని ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్‌కి లోక్‌సభ ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీని విమర్శించే నైతిక అర్హత లేదని యూత్ కాంగ్రెస్ రాష్ట్ర జనరల్ సెక్రటరీ గోళ్ల పవన్‌కుమార్ విమర్శించారు. నూజివీడులో ఆదివారం ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలోని అన్ని మతాలు, కులాలకు చెందిన ప్రజలు ఓట్లు వేస్తేనే పవన్ కల్యాణ్ రాష్ట్రానికి ఉప ముఖ్యమంత్రి అయ్యారనే వాస్తవాన్ని గుర్తించాలన్నారు. పవన్ కల్యాణ్ బీజేపీ, ఆర్ఎస్ఎస్‌ల పెయిడ్ ఏజెంట్‌గా వ్యవహరించడం రాష్ట్ర ప్రజల దౌర్భాగ్యమని ధ్వజమెత్తారు.

వార్డు కౌన్సిలర్ నాగసుధ మృతి



భవానీపురం(విజయవాడ పశ్చిమ): డెంగీ జ్వరంతో కొండపల్లి మున్సిపల్ 7వ వార్డు కౌన్సిలర్ కుమ్మరి నాగసుధ (32) ఆదివారం మృతిచెందారు. మూడు రోజులుగా జ్వరంతో బాధపడుతున్న ఆమెకు స్థానికంగా చికిత్స చేయించారు. జ్వరం తగ్గక పోవడంతో మెరుగైన వైద్యం కోసం విజయవాడకు తరలిస్తుండగా మార్గమధ్యంలోనే మృతిచెందారు. 2021లో జరిగిన మున్సిపల్ పాలకవర్గ ఎన్నికల్లో ఆమె 7వ వార్డు కౌన్సిలర్‌గా విజయం సాధించారు. ఎమ్మెల్యే వసంత కృష్ణప్రసాద్, పలువురు వార్డు కౌన్సిలర్లు, వివిధ పార్టీల నాయకులు ఆమె మృతదేహాన్ని సందర్శించి నివాళులర్పించారు.

లలితా త్రిపుర సుందరీదేవియే నమః

నూజివీడు: దసరా శరన్నవరాత్రి ఉత్సవాలు ఆదివారం నాలుగో రోజుకు చేరాయి. అమ్మవార్లు లలితా త్రిపు సుందరీదేవి, వివిధ రూపాల్లో భక్తులకు దర్శనమిచ్చారు. భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించి తీర్థప్రసాదాలు స్వీకరించారు. నూజివీడు పట్టణంలోని పురాతన ఆలయమైన కోట మహిషాసురమర్దిని అమ్మవారి ఆలయంలో కోట మహిషాసురమర్దిని అమ్మవారు లలితాత్రిపుర సుందరీదేవి అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. వేకువజాము నుంచే భక్తులు పెద్దఎత్తున ఆలయానికి తరలివచ్చి దర్శించుకున్నారు. కుంకుమార్చనలు నిర్వహించారు. ఆలయ ప్రాంగణంలో చండీ హోమం నిర్వహించారు. పట్టణంలోని కంచికామాక్షి ఆలయంలో అమ్మవారికి ప్రత్యేక పూజలు జరిపారు. పాతపేటలోని జ్ఞాన సరస్వతీ ఆలయం, శ్రీ సర్వసతీ ఆలయం, దత్తాశ్రమం, 32వ వార్డులోని దుర్గామల్లేశ్వరస్వామి ఆలయం, 5వ వార్డులోని గంగానమ్మ ఆలయంలో అమ్మవారు లలితా త్రిపుర సుందరీదేవి అలంకరణలో దర్శనమిచ్చారు. బస్టాండ్ వద్ద శివాలయంలోని అమ్మవారు అన్నపూర్ణాదేవి అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు.

అన్నపూర్ణాదేవికి ప్రత్యేక పూజలు..

బలివే (ముసునూరు): దేవీ శరన్నవరాత్రి మహోత్సవాల్లో భాగంగా ఆదివారం అమ్మవారు అన్నపూర్ణమ్మగా, లలితా త్రిపుర సుందరీ దేవిగా పూజలందుకున్నారు. బలివేలోని రామలింగేశ్వరస్వామి దేవస్థానంలోని ఉపాలయం రాజరాజేశ్వరి అమ్మవారు అన్నపూర్ణాదేవిగా దర్శనమిచ్చారు. లోపూడిలోని శ్రీకోదండ రామాలయం, ముసునూరులోని రైస్ మిల్లు సెంటర్, గోపవరం నాగేంద్రపురం సెంటర్ల వద్ద మండపాల్లో అమ్మవార్లను లలితా త్రిపుర సుందరీదేవిగా అలంకరించి ప్రత్యేక పూజలు చేశారు.

- చాట్రాయి: దేవీ నవరాత్రుల సందర్భంగా ఆదివారం శ్రీ లలితా త్రిపుర సుందరీ దేవిగా అమ్మవారు భక్తులకు దర్శనమిచ్చారు. ఈ సందర్భంగా భక్తులు అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు.
- గంపలగూడెం: మండలంలోని పలు ఆలయాలు, నవరాత్రి ప్రత్యేక పందిళ్లలో అమ్మవారికి లలితా త్రిపుర సుందరీదేవిగా అలంకారం చేసి విశేష పూజలు నిర్వహించారు.
- మైలవరం: మైలవరం-తిరువూరు రోడ్డులోని పాండురంగస్వామి ఆలయం, విజయవాడ రోడ్డులో కేడీసీసీ బ్యాంక్ వద్ద, కంచి కామాక్షి దేవాలయం, రాజాపేట, నూజివీడు రోడ్డులో ఏర్పాటు చేసిన అమ్మవారి చలువ పందిళ్లలో అమ్మవారిని గాజులు, చెరుకుగడలతో భక్తులు అలంకరించారు.

మారెమ్మ అమ్మవారికి ఎమ్మెల్యే పూజలు

పుట్రేల (విస్సన్నపేట): పుట్రేల మారెమ్మ అమ్మవారి దేవస్థానంలో దసరా శరన్నవరాత్రుల సందర్భంగా తిరువూరు ఎమ్మెల్యే కె. శ్రీనివాసరావు దంపతులు ఆదివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ అర్చకులు ఎమ్మెల్యే దంపతులతో అమ్మవారికి కుంకుమార్చనలు, ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ ఈఓ దుర్గాధనప్రసాద్ పాల్గొన్నారు.

- విస్సన్నపేట: స్థానిక ద్వారకా నగర్‌లోని కనక దుర్గా అమ్మవారి దేవస్థానంలో అమ్మవారిని లలితా త్రిపుర సుందరీ దేవిగా అలంకరించి భక్తులకు దర్శన భాగ్యం కల్పించారు. పుట్రేల మారెమ్మ అమ్మవారి దేవస్థానంలో అమ్మవారిని లలితా త్రిపురసుందరీదేవిగా అలంకరించారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని విశేషపూజలు నిర్వహించారు.

నెమలిలో గజలక్ష్మీదేవిగా..

నెమలి(గంపలగూడెం): గంపలగూడెం మండలం నెమలి శ్రీ వేణుగోపాలస్వామి ఆలయంలో ఆదివారం భక్తులు గజలక్ష్మీ దేవికి విశేష పూజలు జరిపారు. ఆలయంలో శరన్నవరాత్రి వేడుకలు నాలుగో రోజుకు చేరుకున్నాయి. ఆలయ ప్రధాన అర్చకులు తిరునగరి గోపాలాచార్యులు, అర్చక బృందంచే ఆలయంలో రాజ్యలక్ష్మీదేవి అమ్మవారికి గజలక్ష్మీదేవి అలంకారం చేసి పూజలు నిర్వహించారు.

శాకంబరీదేవిగా అమ్మవారు..

వామకుంట్ల(తిరువూరురూరల్): వామకుంట్లలో దేవీ శరన్నవరాత్రి ఉత్సవ పందిరిలో ఆదివారం అమ్మవారిని శాకంబరీదేవిగా అలంకరించారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని పూజాదికాలు నిర్వహించారు. పలు కూరగాయలతో అమ్మవారికి విశేషాలంకరణ చేశారు.

విశేష పూజలు..

తిరువూరు: తిరువూరు కనక దుర్గాలయంలో అమ్మవారిని ధనలక్ష్మిగా, శ్రీరామలింగేశ్వరాలయంలో అన్నపూర్ణాదేవిగా, శ్రీగౌరీ కేదారేశ్వరాలయంలో మంగళగౌరీ దేవిగా, జైహింద్ రైస్‌మిల్ సెంటర్‌లో బాలా త్రిపుర సుందరీదేవిగా, సూర్యా రెస్టారెంట్ రోడ్డులో లలితా త్రిపుర సుందరీదేవిగా, అష్టలక్ష్మీ దేవి ఆలయంలో ధైర్యలక్ష్మిగా అలంకరించి పూజాదికాలు నిర్వహించారు. సామూహిక కుంకుమపూజల్లో మహిళలు పాల్గొన్నారు. సర్దార్ పేట బావయ్య కూరగాయల మార్కెట్ వద్ద దేవీ నవరాత్రి ఉత్సవాల సందర్భంగా అన్నదానం చేశారు.



బలివేలో అన్నపూర్ణేశ్వరీగా దర్శనమిచ్చిన అమ్మవారు



చాట్రాయి మెయిన్ రోడ్డులోని అమ్మవారి ప్రతిమకు పూజలు



నూజివీడు శివాలయంలో శ్రీఅన్నపూర్ణాదేవి అలంకరణ



శ్రీలలితా త్రిపుర సుందరీదేవి అలంకరణలో కోట మహిషమ్మ




వినగడప సుందర హనుమత్ పీఠంలో అమ్మవారి అలంకరణ



దుందిరాలపాడులో పూజలందుకుంటున్న అమ్మవారు



గంపలగూడెం గాంధీసెంటర్‌లో లలితాత్రిపుర సుందరీదేవిగా ..




తోటమూల ప్రత్యేక పందిరిలో ఏర్పాటుచేసిన అమ్మవారి ప్రతిమ



మారెమ్మ అమ్మవారికి పూజలు నిర్వహిస్తున్న ఎమ్మెల్యే శ్రీనివాసరావు దంపతులు



పీటీకొత్తూరు రామాలయంలో అమ్మవారికి పూజలు



మైలవరం పాండురంగస్వామి ఆలయంలో అమ్మవారు



పుట్రేల మారెమ్మ అమ్మవారి దేవస్థానంలో అలంకరణ



విస్సన్నపేట కనకదుర్గఅమ్మవారి దేవస్థానంలో అమ్మవారు



నెమలిలో గజలక్ష్మీ దేవిగా అమ్మవారి అలంకరణ



తిరువూరు కనకదుర్గాలయంలో ధనలక్ష్మి అలంకారం



వామకుంట్లలో శాకంబరి అలంకారంలో అమ్మవారు

గోవుల అక్రమ రవాణాను అడ్డుకున్న పోలీసులు

నెమలి(గంపలగూడెం): గోవుల అక్రమ రవాణాను గంపలగూడెం ఎస్ఐ ఎస్. శ్రీను ఆదివారం అడ్డుకున్నారు. ఆవులు లారీలో తరలిస్తున్నారంటూ ఎస్ఐకి సమాచారం అందింది. ఎస్ఐ సిబ్బందితో కలిసి ఆవులను తరలిస్తున్న లారీని వెంబడించి నెమలి వద్ద అడ్డుకున్నారు. వీటిని హనుమాన్ జంక్షన్ నుంచి హైదరాబాద్‌కు తరలిస్తున్నట్లు సమాచారం ఉందని ఎస్ఐ తెలిపారు. సంబంధిత 50 ఆవులను నెమలి శ్రీ వేణుగోపాలస్వామి ఆలయంలోని గోశాలలో ఉంచారు.

స్వర్గపురికి రూ.లక్ష విరాళం

తిరువూరు: తిరువూరు పూర్వ విద్యార్థుల సంఘం (తోసా) ఆధ్వర్యంలో దాతల సహకారంతో నిర్మించిన స్వర్గపురికి నూతన వాహనం కొనుగోలు నిమిత్తం ఒక దాత ఆదివారం రూ.లక్ష విరాళం అందజేశారు. తెలంగాణ రాష్ట్రంలోని ఖమ్మం జిల్లా వేంసూరు మండలం కొండిగట్లకు చెందిన బోళ్ల రాంబాబు తన తల్లి బేబమ్మ జ్ఞాపకార్థం రూ.లక్ష విరాళాన్ని తోసా సభ్యులకు అందజేశారు.

రచయిత సత్యనారాయణకు విశిష్ట పురస్కారం

పెనుగంచిప్రోలు: స్థానిక కేవీఆర్ జెడ్పీ హైస్కూల్‌కు చెందిన సైన్స్ ఉపాధ్యాయుడు, రచయత ముక్కా సత్యనారాయణకు మరో బిరుదు పురస్కారం లభించింది. ఇష్టపది ప్రక్రియలో అధిక రచనలు చేసినందుకుగాను కరీంనగర్‌కు చెందిన మహతి సాహితీ కవి సంగమం వారు ఆయనకు ఈ బిరుదు ప్రదానం చేశారు. ఈ సందర్భంగా సత్యనారాయణ మాట్లాడుతూ తాను ఇప్పటికే పలు రచనలకు గాను 30 బిరుదు పురస్కారాలు, 900 వరకు ప్రశంసా పత్రాలు అందుకున్నానని, మరోసారి పురస్కారం అందుకోవడం సంతోషంగా ఉందని చెప్పారు.

పూర్వ విద్యార్థుల సమ్మేళనం

కన్నెవీడు(వత్సవాయి):మండలంలోని కన్నెవీడు జెడ్పీ ఉన్నత పాఠశాలలో ఆదివారం పూర్వ విద్యార్థుల సమ్మేళనం జరిగింది. పాఠశాలలో 1980 నుంచి 85 చదువుకున్న పూర్వవిద్యార్థులందరూ కలుసుకున్నారు. పూర్వ విద్యార్థులంతా కలిసి అప్పటి ఉపాధ్యాయులు నాంచారయ్య, రామకృష్ణను ఘనంగా సన్మానించారు. సర్పంచ్ చావా దుర్గారాణి మాట్లాడుతూ పాఠశాల అభివృద్ధికి పూర్వ విద్యార్థులు కృషి చేయాలని కోరగా, అందుకు తమ వంతుగా సాయం అందిస్తామని వారు హామీ ఇచ్చారు. కార్యక్రమంలో మాజీ ఏఎంసీ చైర్మన్ కర్నాటి అప్పారావు, చావా శ్రీధర్, కర్నాటి రఘు తదితరులు పాల్గొన్నారు.

వ్యక్తికి తీవ్ర గాయాలు

కంచికచర్ల : ఎదురుగా వస్తున్న కంటైనర్ బైక్‌ను ఢీకొనడంతో ఓ వ్యక్తి తీవ్రంగా గాయపడిన ఘటన ఆదివారం చోటుచేసుకుంది. సేకరించిన వివరాల ప్రకారం వీరులపాడు మండలం జుజ్జూరు గ్రామానికి చెందిన వీరభద్రం అనేవ్యక్తి బైక్‌పై పరిటాల వైపు నుంచి జుజ్జూరుకు వస్తుండగా ఎదురుగా వస్తున్న కంటైనర్ లారీ ఢీకొంది. ఈ ఘటనలో తీవ్రంగా గాయపడిన అతన్ని నేషనల్ హైవే అంబులెన్స్ వాహన సిబ్బంది చికిత్సనిమిత్తం విజయవాడలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు.

అన్నీ ఉన్నా.. ఆదరణ అంతంతమాత్రమే

- అన్ని వసతులతో శాఖా గ్రంథాలయం
- అందుబాటులో వేలాది పుస్తకాలు
- పుస్తక పఠనంపై తగ్గుతున్న ఆసక్తే కారణం

నూజివీడు: పట్టణంలోని ప్రథమశ్రేణి శాఖా గ్రంథాలయం అన్ని వసతులతో వేలాది విజ్ఞాన పుస్తకాలతో అందుబాటులో ఉన్నప్పటికీ దీనిని ఉపయోగించుకునే వారు చాలా తక్కువగా ఉంటున్నారు. సుమారు 70 వేల జనాభా ఉన్న పట్టణంలో గ్రంథాలయానికి రోజుకు పట్టుమని 200 మంది కూడా రావడం లేదు. ఉదయం 9 నుంచి రాత్రి 8 గంటల వరకు తెరిచి ఉండే గ్రంథాలయానికి ఒక గంట సేపు వచ్చి చదువుకునే వారే లేరంటే పరిస్థితులు ఎంత దారుణంగా ఉన్నాయో అర్థమవుతోంది. కనీసం సెలవు రోజు అయినా వస్తున్నారంటే అదీ లేదు.

అందుబాటులో 30 వేల పుస్తకాలు

గ్రంథాలయంలో 30,377 పుస్తకాలు అందుబాటులో ఉన్నాయి. వీటిల్లో పోటీ పరీక్షల పుస్తకాలు, టెక్ట్స్‌బుక్స్, నవలలు, కథలు, తెలుగు సాహిత్యం, బాలసాహిత్యం, గొప్ప గొప్ప రచయితలు రాసిన నవలలు, ఇతిహాసాలు తదితర పుస్తకాలు ఉన్నాయి. అలాగే 11 రకాల దినపత్రికలు, 19 రకాల మాస పత్రికలు, 4 రకాల వార పత్రికలు, రెండు రకాల పక్ష పత్రికలు సైతం ప్రజలకు అందుబాటులో ఉన్నాయి. పలువురు అభ్యుదయ వాదులు ఉచితంగా అందించిన పలు రకాల విజ్ఞాన పుస్తకాలు ఉన్నాయి. ఈ గ్రంథాలయానికి డిపాజిట్ చెల్లించి సభ్యులుగా చేరిన వారు దాదాపు 3,200 మంది ఉన్నారు.



నూజివీడులోని ప్రథమ శ్రేణి శాఖా గ్రంథాలయం

ఇంటర్నెట్ సదుపాయం

గ్రంథాలయంలో ఇంటర్నెట్ సదుపాయం సైతం ఉంది. గంటకు రూ.5 చెల్లించి ఇంటర్నెట్‌ను ఉపయోగించుకోవచ్చు. విజ్ఞానాన్ని పెంపొందింప చేసుకునేందుకు ఎంతో దోహదపడే గ్రంథాలయాలను భావి భారత పౌరులు ఉపయోగించుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

గ్రంథాలయాలను ఉపయోగించుకోవాలి



విద్యార్థి దశ నుంచే గ్రంథాలయాలకు వెళ్లడం అలవర్చుకుని విజ్ఞానాన్ని పెంపొందించుకోవాలి. తల్లిదండ్రులు కూడా గ్రంథాలయానికి వెళ్లమని పిల్లలకు తెలపాలి. అవసరమైతే వారిలో ఆసక్తి కలిగేలా తల్లిదండ్రులు తమతో వారిని తీసుకెళ్లాలి.

– రెబ్బ మురళీకృష్ణ , జూనియర్ లెక్చరర్, నూజివీడు